క్లుప్తంగా

నాగిరెడ్డికి డొక్కా సీతమ్మ జాతీయ పురస్కారం

కారంచేడు: మండలంలోని యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు మున్నంగి నాగిరెడ్డికి డొక్కా సీతమ్మ జాతీయ పురస్కారం లభించినట్లు ఆయన తెలిపారు. ఆదివారం పొన్నూరు కిరాణా మార్చంట్స్ కల్యాణ మండపంలో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు టి. ఉమాశంకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాగిరెడ్డికి అవార్డును ప్రదానం చేశారన్నారు. చీరాలతో పాటు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఆయన చేస్తున్న విశేష సేవలకు గుర్తుగా ప్రదానం చేశామని నిర్వాహకులు ప్రకటించారని చెప్పారు.

ఘనంగా వార్షిక వేడుకలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని అడవిపాలెం పంచాయతీ పరిధిలోని అడుగుపాలెం గ్రామంలో సోమవారం లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పసుపు, కుంకుమ బండ్లు ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

ఉత్సాహంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందు అందిస్తున్న ట్రస్ట్ బాధ్యులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని కొమ్మాలపాడు పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం రాత్రి షేక్ కాలేషాగారి చాంద్‌బీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1500 మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు అందజేశారు. కార్యక్రమంలో కాలేషాగారి ఖాదర్‌మస్తాన్, రెడ్ బాషా, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

అవోపా సేవలు ప్రశంసనీయం



బియ్యం, పెన్షన్లు అందిస్తున్న అతిథులు

చీరాల టౌన్: పేదలు, నిరాశ్రయులు, వితంతువులకు ప్రతి నెలా ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు, ఆహారం అందిస్తూ అవోపా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం పట్టణంలోని అవోపా కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు, భోజనం, 200 మందికి పెన్షన్ పంపిణీ చేశారు. అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేరెళ్ల భాగ్యలక్ష్మి, వలివేటి రాఘవరత్నం, జవ్వాజి వెంకట నాగలక్ష్మి, ప్రాజెక్టు చైర్మన్ మారుటూరి రాఘవేంద్రరావు, గెలి సుకన్య, సూరంపల్లి తేజస్విని, సువర్ణలక్ష్మి, నారాయణ, రామయ్య, గురుప్రసాద్, సుందరి తదితరులున్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



స్వర్ణలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

స్వర్ణ(కారంచేడు): ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి 55 వార్షిక మహోత్సవాలు కన్నుల పండవగా ఘనంగా జరిగాయి. ఆదివారం మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ఆర్య, వైశ్యులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి మహిళలు పెద్ద ఎత్తున కుంకమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అర్యవైశ్య మహిళలంతా పాల్గొన్నారు. అనంతరం పెద్ద ఎత్తున్న అన్న సంతర్పరణ నిర్వహించారు.

పేకాట జూదరుల అరెస్ట్

మేదరమెట్ల: కొరిశపాడు మండల పరిధిలోని బొల్లవరప్పాడు గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో కొరిశపాడు ఎస్సై సురేష్ తన సిబ్బందితో దాడిచేసి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిఘా లేక దగా!

- ఆహార సలహా సంఘాల జాడేది?
- సమావేశాలు నిర్వహించకుండా తాత్సారం
- రేషన్‌షాపులపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో పెరిగిపోతున్న మోసాలు



వేటపాలెం తహసీల్దార్ కార్యాలయం

వేటపాలెం: రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకుల అక్రమాలకు చెక్‌పెట్టి, పేదలకు సక్రమంగా నిత్యావసర సరుకులు అందేలా చూడాల్సిన బాధ్యత ఆహార సలహా సంఘాలపై ఉంటుంది. ప్రతి మూడు నెలకోసారి ఆహార సలహా సంఘం ఆధ్వర్యంలో రేషన్ సరుకుల పై సమీక్షించి అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే చీరాల నియోజకవర్గంలో ఎక్కడా సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. చీరాల టౌన్, చీరాల రూరల్, వేటపాలెం మండలాల పరిధిలో మొత్తం 294 రేషన్ దుకాణాల్లో 57,010 తెల్ల రేషన్ కార్డులున్నాయి.

కాగా రేషన్ దుకాణాల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసింది. ఈ సంఘాలకు చైర్మన్‌గా సబ్ కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా తహసీల్దార్, సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు, హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాత్రికేయులు, ఉపాధ్యాయులుంటారు. ఆహార సలహా కమిటీకి రేషన్ షాపుల తనిఖీలు, బియ్యం సరఫరాపై నిఘా, తూనికలు, కొలతలపై పర్యవేక్షణ అధికారాలున్నాయి. కానీ సంబంధిత అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి, సమావేశాలు నిర్వహించకపోవడంతో రేషన్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సరుకుల నాణ్యతను పట్టించుకునే వారు కరువయ్యారు. రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో చోటు చేసుకుంటున్న సమస్యలపై పలుమార్లు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. షాపుల్లో సకాలంలో సరుకులు పంపిణీ చేయలేదని, కొలతల్లో తేడాలుంటున్నాయని, ఆన్‌లైన్ సక్రమంగా పనిచేయలేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే సరుకులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలను నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, రేషన్ దుకాణాలకు వెళ్లి క్యూలో నుంచొని అవస్థలు పడి సరుకులు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

> **లోపించిన పర్యవేక్షణ**
> గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాపుల్లో చోటు చేసుకుంటున్న లోటుపాట్లపై సమావేశాల్లో అధికారుల దృష్టికి సంఘ సభ్యులు తీసుకొచ్చే వారు. ప్రస్తుతం ఆ సంఘాలు పనిచేస్తున్నాయా, లేదా అని కూడా తెలియడంలేదు.
> – శ్రీనివాసరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ

నేటి నుంచి పది పరీక్షలు

చినగంజాం: మండలంలో నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ బొల్లిముంత అజయ్‌బాబు తెలిపారు. మండలంలో మొత్తం 417 మంది రాస్తున్నట్లు వారిలో బాలురు 190 మంది, బాలికలు 227 మంది ఉన్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిలో చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 11 రూంలు ఏర్పాటు చేయగా 259 మంది రాస్తుండగా చీఫ్‌గా కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డి. హేమంత్ కుమార్, డిపార్ట్‌మెంట్ అధికారిగా పందిళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వై. రత్నం వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. కడవకదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 11 రూంలు ఏర్పాటు చేయగా 158 మంది పరీక్ష రాస్తున్నట్లు చెప్పారు. చీఫ్‌గా వేటపాలెం గరల్స్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఏవీ సుబ్బారావు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా ఇంకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డి. మెరియన్ బాబు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ఇంకొల్లులో..

మండలంలో 10వ తరగతి పరీక్షల నిర్వహణ కోసం మొత్తం 6 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, పరీక్షను 793 మంది రాస్తున్నట్లు ఎంఈఓ బి. అజయ్ బాబు తెలిపారు. ఇంకొల్లు మండల విద్యాసంస్థలకు సంబంధించి 578 మంది రాస్తుండగా వారిలో బాలురు 342 మంది, బాలికలు 236 మంది ఉన్నట్లు తెలిపారు. ఇంకొల్లు మండలంలోని విద్యార్థులుండగా వారితో పాటు ఇంకొల్లు మండల దగ్గర గ్రామాలు జె. పంగులూరు, కారంచేడు మండలంలోని విద్యార్థులు 215 మంది పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఇంకొల్లు జెడ్పీ హైస్కూల్‌లో 180 మంది, పావులూరులో 93 మంది, పూసపాడు ఎస్‌కేపీవీఎస్ హైస్కూల్‌లో 57 మంది, ఇంకొల్లు ఎస్ఆర్‌వీఎస్ఆర్ గరల్స్ హైస్కూల్ 144 మంది, ఆదర్శ హైస్కూల్‌లో 160 మంది, గౌతమి హైస్కూల్‌లో 159 మంది విద్యార్థులు రాస్తున్నట్లు తెలిపారు.

పర్చూరులో..

పర్చూరు మండలంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 672 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఎంఈఓలు సత్యనారాయణ, వెంకటరామయ్యలు తెలియజేశారు. పర్చూరు వైఆర్ హైస్కూల్‌లో 188 మంది, నాగులపాలెం ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో 268 మంది, పర్చూరు బీఏఆర్ అండ్ టీపీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 163 మంది, అన్నంబొట్లవారిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 53 మంది పరీక్షకు హాజరవుతున్నట్లు వారు వివరించారు.

బల్లికురవలో...

బల్లికురవ: మండలంలో పది పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో 2 కె. రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. బల్లికురవ, పెద అంబడిపూడి, వైదన, పరీక్ష కేంద్రాల్లో 9 పాఠశాలలకు చెందిన 488 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు.

పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు



చినగంజాం: రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థులకు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు. పరీక్షల్లో ఎటువంటి భయం లేకుండా ఉండాలని, చదివిన ప్రశ్నలకు సక్రమంగా జవాబులు రాయాలని సూచించారు.

అమరజీవి త్యాగం మార్గదర్శకం



చినగంజాం: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వనితా క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్యులు



స్వర్ణ గ్రామంలో అమరజీవికి నివాళులర్పిస్తున్న మహిళలు



చీరాల: నివాళులర్పిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి

చీరాల: అమరజీవి త్యాగాలు అజరామరమని ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో పయనించాలని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు సూచించారు. అమరజీవి పొట్టిశ్రీరాములు 124 జయంతిని ఆదివారం పట్టణంలోని కామధేను కాంప్లెక్స్ వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాలతో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం, వార్డు కౌన్సిలర్లు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ మహనీయుల త్యాగఫలితంగానే స్వాతంత్ర్య ఫలాలు లభించాయని యువత మహనీయుల అడుగుజాడల్లో పయనించాలన్నారు. పొట్టిశ్రీరాములు పోరాటాలను ప్రశంశించారు. భావితరాలకు మార్గదర్శమని ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

వేటపాలెం: అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ సెంటర్ వద్ద గల పొట్టి శ్రీరాములు స్మారక స్మృతి పరిరక్షణ సమితి, వాసవీ క్లబ్, వనిత వైష్ణవి క్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళలర్పించారు. పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ శ్రీరాములు త్యాగాన్ని మరువ లేమన్నారు. ఆయన చేసిన త్యాగబలమై ఆంధ్రరాష్ట్ర భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిందన్నారు. అమరజీవి శ్రీరాములు మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరేపితుడై ఉద్యమంలో పాల్గొని పలుమార్లు జైలుకి వెళ్లారని గుర్తు చేశారు. సమితి కార్యదర్శి ఊటుకూరి వెంకట నాగ శ్రీనివాసరావు, లక్ష్మణ స్వామి, మనోహర్ లోహియా, సుంకర వెంకటలక్ష్మీ ప్రసాద్, నున్నా శివప్రసాదరావు, పద్మనాభుని నారాయణరావు తదితరలు పాల్గొన్నారు.

అద్దంకి: పొట్టి శ్రీరాములు త్యాగ ఫలమే ఆంధ్ర రాష్ట్రమని పలువరు వక్తలు అన్నారు. మెయిన్‌రోడ్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లోని విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాల వేశారు. కార్యక్రమంలో ఊటుకూరి రామకోటేశ్వరరావు, గునుపూడి రఘురామగుప్తా, కౌన్సిలర్ అత్తులూరి రమేశ్‌పెద్దలున్నారు. మైలవరంఉన్నత పాఠశాలలో వేడుకలను నిర్వహించారు.

చినగంజాం: అమర జీవి పొట్టి శ్రీరాములు జయంతిని మండల కేంద్రమైన చినగంజాంలో కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చినగంజాం ఆర్యవైశ్య సంఘం, వాసవీ వనితా క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో స్థానిక వాసవీ అమ్మవారి మందిరం ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట కోసం తన ప్రాణాలు అర్పించారని.. ప్రస్తుతం ఆయన సాధించి పెట్టిన రాష్ట్రం మనది అని వక్తలు అన్నారు.



అద్దంకి: రోటరీ ఆధ్వర్యంలో..

చలివేంద్రం ఏర్పాటు

వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చినగంజాంలో చలి వేంద్రం ఏర్పాటు చేశారు. జోన్ చైర్మన్ దేసు రవిసుధాకర్ ప్రారంభించారు. దాత వేద రవి శంకర్ పుట్టిన రోజు పురస్కరించుకొని మజ్జిగ అందజేసారు. ఆయా కార్యక్రమాల్లో వేద కృష్ణకుమారి, మోటుమర్రి శేషకుమారి, అమరా నాగలక్ష్మి, అమరా నాగలక్ష్మి, పొట్టి శైలజ, పాల్గొన్నారు.

చీరాల రూరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ ఎన్ఆర్అండ్‌పీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైస్కూలు క్రీడా మైదానంలో పొట్టి శ్రీరాములు 124 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన మహానుభావుడని, దేశ స్వాతంత్ర్యం కోసం నిర్విరామంగా పోరాడి స్వాంత్ర్య సమరయోధునిగా చరిత్రలో అమరజీవిగా నిలిచిపోయారని కొనియాడారు.సెక్రటరీ చారుగుళ్ల గురుప్రసాద్, గుంటూరు శ్రీనివాసరావు, గోగుపర్తి వెంకట సురేష్, చెన్ననారాయణ, నాగ శివప్రసాద్, పూర్ణచంద్రరావు, తిరుపతిరావు, వీరాంజనేయులు, సుబ్బారావు, రమేష్, లాల్, బాల వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

కారంచేడు: ఉమ్మడి తెలుగు రాష్ట్ర అవతరణ కోసం 58 రోజుల ఆమరణ నిరాహారదీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివారం మండలంలోని మండలంలోని స్వర్ణలో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్య, వైశ్య మహిళలు ఘనంగా నివాళులర్పించారు. ఎస్. సంధ్యారాణి, కె. యామిని, ఎస్. అన్నపూర్ణ, కేవీఎస్ లక్ష్మి, కేవీ లత, ఎస్. లక్ష్మి, పి. రమ, మహిళలు నివాళులర్పించారు.

మార్టూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కమిటీ హాలు వద్ద గల మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు రోటరీ క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వలపర్ల గ్రామంలో బాపట్ల జిల్లా వినియోగదారుల హక్కుల సంఘం కమిటీ ఆధ్వర్యంలో సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగాలను వారు కొనియాడారు.



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ జంజనం, తదితరులు



మార్టూరులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు



వేటపాలెంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

పంచాయతీ కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయితీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి విధిగా రెవెన్యూ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని విచారించాలని సూచించారు.

గిరిపుత్రులను ఆదుకోండి



కూకట్లపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

బల్లికురవ: గ్రామాల్లోని గిరిపుత్రులు అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారని ఆదుకోవాలని బాపట్ల జిల్లా సీపీఎం కార్యదర్శి సీహెచ్ గంగయ్య కోరారు. శనివారం రాత్రి 11 గంటలకు మండలంలోని కూకట్లపల్లి పంచాయతీలోని యానాది సంఘం కాలనీలో ఇంటింటికీ తిరిగి అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం దశాబ్దాల క్రితం ఇచ్చిన భూములు అన్యాక్రాంతమయ్యాయని అనేకపర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా తమ గోడు పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు వాపోయారు. వీధి లైట్లు వెలగక, మురుగునీరు ముందుకు కదలక మురుగు కాలువలు లేక, సిమెంట్‌రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంలో గంగయ్య మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అంటూ అధికారులు ఫొటోలకు పోజులిస్తున్నారే తప్ప గిరిపుత్రులు నివశించే కాలనీలు సందర్శిస్తే సమస్యలు తెలుస్తాయన్నారు. కార్యక్రమాల్లో సీపీఎం అద్దంకి డివిజన్ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పి. రమణయ్య పాల్గొన్నారు.

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా?



కొటికలపూడి రహదారిలో తీసిన గాళ్లు



అద్దంకి- బల్లికురవ రహదారి ఇలా..

అద్దంకి:

మండలంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. కనీసం ఆ రహదారుల్లో వాహన ప్రయాణం నరకప్రాయంగా మారింది. కాలి నడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాటిలో అద్దంకి నుంచి బల్లికురవ వెళ్లే రహదారిలో ఒక కిలోమీటరు మేర వాహన ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇక్కడ రోడ్డు లేచిపోయి గోతులమయంగా మారింది.

కొటికలపూడిలో..

కొటికలపూడి వెళ్లేరహదారి ఐదు కిలోమీటర్లు గ్రావెల్ లేచిపోయిన ప్రయాణం నరకప్రాయంగా మారింది. గోరుచుట్టుపై రోకటిపోటు అన్న చందంగా కొందరు తమ పొలాలకు నీరు పెట్టుకునేందుకు రహదారికి అడ్డంగా గాళ్లుతీసి రోడ్డును మరీ పాడు చేయడంతో వాహనచోదకులకు మరింత ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు ఆయా రహదారులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు

చీరాల టౌన్: పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం చీరాల మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. వేటపాలెం సమితి, పర్చూరు సమితి పీఆర్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా మాజీ అధ్యక్షుడు వై.పోలయ్య, అబ్జర్వర్ షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మల్లిఖార్జున, అధ్యక్షులుగా చంద్రశేఖర్ (పర్చూరు), వైస్ ప్రెసిడెంట్‌గా బీడీఎల్ ఫ్రాంక్లిన్ (పర్చూరు), సెక్రటరీగా ఎల్. అమర్‌నాథ్ (చీరాల), జాయింట్ సెక్రటరీగా రాజశేఖర్ (పర్చూరు), ఎస్.జాహ్నవి వర్దన్ (చీరాల), మహిళా అధ్యక్షురాలిగా టి.ధనలక్ష్మి (చీరాల), కో ఆప్షన్‌మెంబర్‌గా శ్రీధర్, ఈసీ మెంబర్‌గా కన్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం 2028 మార్చి 15 పదవుల్లో ఉంటారని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు కృషి చేయాలని నూతన పాలకవర్గాన్ని జిల్లా కమిటీ ప్రతినిధులు సూచించారు.